క్లుప్తంగా

ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలు

ఐరాల: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రతి ఇంటికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని మొరంపల్లిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పొంగళ్లు



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

యాదమరి: మండలంలోని కె.కొత్తూరు గ్రామంలో ముత్యాలమ్మకు గ్రామస్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం గరిగెను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలు పరిమళ



యాదమరి: మండలంలోని సిద్దారెడ్డి పల్లె ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయురాలు పరిమళ కుమారి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైంది. ఆమె 2013లో పూతలపట్టు మండలం బందార్ల పల్లె ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులుంటే గ్రామస్థుల సహకారంతో 67 మందికి పెంచారు. 2015లో పెనుమూరు మండలంలో చిన్నకలికిరి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉండగా 80 మందికి పెంచారు. దాతల సాయంతో పాఠశాలకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేశారు. మూడు నెలల క్రితం యాదమరి మండలం సిద్దారెడ్డి పల్లె ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు.

చెత్త బుట్టల పంపిణీ

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలకు యాదమరిలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు చెత్త బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి, రూ.8 వేలు విలువ గల చెత్త బుట్టలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు అందించారు.

విద్యార్థులకు మినరల్ వాటర్



ప్యూరిఫయ్యర్ అందిస్తున్న పార్థసారథి

యాదమరి: మండలంలోని దిగువ కణతల చెరువు ఉన్నత పాఠశాలకు బంగారుపాళెం మండలం తుంబకుప్పం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పార్థసారథి నీటి శుద్ధీకరణ యంత్రం విరాళంగా అందించారు. దాత గతంలో దిగువ కణతల చెరువు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహించి బదిలీపై తుంబకుప్పం ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ఆయనకు ఇక్కడి సమస్యలను గుర్తించి, వాటర్ ప్యూరిఫయ్యర్ అందించినందుకు పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్తూరులో కుండపోత





వర్షంలో వెళుతున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. అరగంటకుపైగా కురిసిన వర్షానికి రోడ్లంతా జలమయంగా మారాయి. వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఇక పాఠశాలలు వదిలే సమయానికి భారీ వర్షం కురవడంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. కొంత మంది తడుస్తూ, ద్విచక్ర వాహనంలో పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. మరికొందరు గొడుగుల కింద పిల్లలను జాగ్రత్తగా తీసుకెళ్లారు. ఇంకొందరు తడుస్తూనే వెళ్లారు.

కుదుటపడిన గుడిపాల

- మదపుటేనుగు బంధీతో ప్రశాంతం
- తిరుపతి జూపార్కులో భీ'కరి' పర్యవేక్షణ
- ప్రాణాలతో బయటపడిన కార్తిక్
- ఫలించిన అటవీశాఖ వ్యూహం





ఏనుగు దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న కార్తిక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గుడిపాలలో బీభత్సం సృష్టించిన మదపుటేనుగు

చిత్తూరు అర్బన్: చిత్తూరు సమీపంలో ఒంటరి ఏనుగు సృష్టించిన విధ్వంసకాండ నుంచి గుడిపాల మండలం, చిత్తూరు నగర శివారు ప్రాంతాలు కాస్త కుదుటపడ్డాయి. ఒంటరి ఏనుగును అటవీశాఖ అధికారులు బంధించి తిరుపతికి తరలించడంతో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. ప్రాణం నష్టం జరిగిపోయినప్పటికీ, అధికారుల అప్రమత్తతతో మరింత నష్టం తప్పింది.

క్షణకాలంలోనే.

ఏనుగుల గుంపులు రావడం, మదనపుటేనుగుల విధ్వంసంలో ప్రాణాలు కోల్పోవడం అనేది ఒకప్పుడు పలమనేరు, కుప్పం, బంగారుపాళ్యం అటవీ ప్రాంతాల్లోనే మాత్రమే కనిపించేది. కానీ ఇటీవల తమిళనాడు అడవుల నుంచి చిత్తూరు వైపు ఏనుగుల గుంపులు వస్తున్నాయి. చిత్తూరు నగరంలోని మాపాక్షి, తుమ్మింద, ప్రశాంత్‌నగర్‌తో పాటు చిత్తూరు రూరల్ మండలంలోని శెట్టిన్ తంగాల్, గుడిపాలలోని రామాపురం ప్రాంతాల్లో ఇటీవల ఏనుగుల గుంపులు విధ్వంసం చేసి స్థానికులను కలవరపాటుకు గురిచేశాయి. అయితే మూడు రోజుల క్రితం తమిళనాడు గుంపు నుంచి తప్పిపోయిన ఒంటరి ఏనుగు చొరబడి ముగ్గురి ప్రాణాలను బలిగొంది. గుడిపాలలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృత్యువాత పడటం తెలిసిందే. ఏమాత్రం ఊహకు కూడా అందనిరీతిలో మదపుటేనుగు మనుషుల్ని, పశువుల్ని తొక్కి చంపడంతో ఒక్కసారిగా గుడిపాల వాసులు ఉలిక్కిపడ్డారు. కళ్లు మూసి తెరిచేలోపు ఉపద్రవం వచ్చినట్టు మదపుటేనుగు చేసిన గాయం ఇప్పుడప్పుడే మానదు. అధికారులకు చిక్కిన ఒంటరి ఏనుగు వేసిన ఘీంకారం అడుగుల శబ్దం నుంచి చిత్తూరు, గుడిపాల ప్రాంతాలు కాస్త కోలుకుంటున్నాయి. ఏనుగు దాడిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న గుడిపాలకు చెందిన కార్తిక్ క్రమంగా కోలుకుంటున్నట్టు అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. మరోవైపు తమిళనాడులోని రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తిక్‌ను శనివారం పరామర్శించిన చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు, అన్ని విధాలుగా తామున్నామని భరోసా ఇచ్చారు.

తప్పిన ముప్పు

వాస్తవానికి గుంపు నుంచి తప్పిపోయిన ఒంటరి ఏనుగు మంగళవారం రాత్రి దాదాపు 30 కిలోమీటర్లు దూరం వెళ్లి మామిడితోటలో సేద తీరినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఓ వ్యక్తి ఏనుగుపై కర్ర విసరడంతో అది ఒక్కసారిగా ఆగ్రహానికి గురై దారిలో ఉన్న కార్తిక్ అనే యువకుడిని ఎత్తి పక్కకేసి, వెంకటేష్, సెల్వి దంపతులను తొక్కి చంపేసింది. ఏనుగును గుర్తించిన వ్యక్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లయితే అసలు ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా దాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించేవాళ్లు. దంపతుల మృతి తరువాత కుంకీ ఏనుగులను రంగంలోకి దించడం, అంతలోపు తమిళనాడులోకి వెళ్లిన ఒంటరి ఏనుగు అక్కడ ఓ మహిళను చంపేసి, మళ్లీ గుడిపాలలోకి రావడంతో అధికారుల్లో టెన్షన్ నెలకొంది. అయితే మదపుటేనుగులను బంధించడంలో చిత్తూరు అటవీశాఖ అధికారి (డీఎఫ్‌ఓ) చైతన్య కుమార్‌రెడ్డి ఓ వ్యూహం ప్రకారం ముందుకు వెళ్లి.. చివరకు కుంకీ ఆపరేషన్ విజయవంతమయ్యేలా వ్యవహరించారు. ఫలితంగా ఒంటరి ఏనుగు బీభత్సానికి తెరపడింది.

సమస్యను తెచ్చుకోవద్దు



ఊహించకుండా జరిగితే ప్రమాదమవుతుంది. కానీ సమస్యను కొని తెచ్చుకోవద్దు. మదం ఎక్కిన మగ ఏనుగులు గుంపు నుంచి తప్పిపోయినపుడు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతుంటాయి. ఆ సమయంలో జంతువులు, మనుషులను లెక్క చేయవు. గుడిపాలలోకి వచ్చిన ఏనుగును మా వాళ్లు గమనించేలోపు దాన్ని కొందరు రెచ్చగొట్టడంతో ఇదంతా జరిగింది. ఏ జంతువైనా ఊర్లోకి వస్తే వెంటనే అటవీశాఖ, పోలీసులకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం. బంధించిన ఏనుగు కొన్నాళ్ల పాటు తిరుపతి జూ పార్కులోనే ఉంటుంది.

– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ, చిత్తూరు

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం



గుడిపాల: సేవలందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. నంగమంగళం గ్రామంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. 65 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలత, శాంతకుమారి, యమున, దివ్య, వరలక్ష్మి, రూబి పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు తప్పకుండా వేసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు తప్పకుండా ఐరన్ మాత్రలు తీసుకోవాలని వైద్యాధికారులు ప్రియాంక, వినయ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఎగువ తవణంపల్లె, ఎగువ మత్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ క్లినిక్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్ రెడ్డి, నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు ఝాన్సీ, భార్గవి, డీఈఓలు విజయలక్ష్మి, రవికుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కిట్‌లను అందజేస్తున్న సూపర్‌వైజర్

గుడిపాల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత తెలిపారు. మండలంలోని నారగల్లు అంగన్‌వాడీ సెంటర్లో శుక్రవారం జాతీయ పోషకాహార వారోత్సవం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ నాణ్యమైన పౌష్టికాహారం ప్రతి తల్లీ బిడ్డకు అందాలని స్పష్టం చేశారు. జంక్‌ఫుడ్ పట్ల ఆకర్షితులై యువత ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటోందని, బజారులో దొరికే ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. పౌష్టికాహార ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసమే ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్ల ద్వారా పౌష్టికాహారం వల్ల కలిగే లాభాల గురించి అందరికీ అర్థమయ్యే రీతిలో చెబుతున్నామన్నారు. మాంసాహారం వద్దు–శాకాహారం ముద్దు అన్న నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం వైఎస్సార్ పోషణ కిట్ ద్వారా మూడు కేజీల బియ్యం, వంటనూనె అరలీటర్, పాలు 5 లీటర్లు, కేజీ కందిపప్పు, వేరుశనగ చిక్కి, రాగిపిండి రెండు కిలోలు, అటుకులుకిలో, కోడిగుడ్లు 25, ఎండుఖర్జూర 250 గ్రాములు, బెల్లం 250 గ్రాములు వారికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుమతి, ఆశావర్కర్ తమరై పాల్గొన్నారు.

ఐరాల పాఠశాలకు క్రీడా ఎక్సలెన్సీ పురస్కారం



క్రీడా ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ఎక్సలెన్సీ పురస్కారానికి ఎంపికైనట్లు శుక్రవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను, పీడీలను హెచ్‌ఎం అభినందించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల్లో భాగంగా అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు జిల్లాలో క్రీడా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో జాతీయ, రాష్ట్ర స్థాయి జోనల్స్‌లో ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలను ఎంపిక చేశారన్నారు. ఇందులో ఐరాల పాఠశాల మొదటి స్థానం సాధించిందని పేర్కొన్నారు. ఈ అవార్డును జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని డీఈఓ విజయేంద్రరావు క్రీడా ఎక్సలెన్సీ అవార్డును అందజేసినట్లు వివరించారు.

అర్హులందరికీ పింఛన్లు

గుడిపాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 27 పంచాయతీలకు సంబంధించి 196 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కొంతమందికి రెండు మూడు రోజుల్లో కొత్త పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇంకా ఎవరైన అర్హులు ఉన్నట్లయితే వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లను కొత్తగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

నూతన పింఛన్లు పంపిణీ

ఐరాల: మండలంలో నూతనంగా 224 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎం.పైపల్లెలో నూతనంగా మంజూరైన 22 మందికి సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మునస్వామిరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

81 శాతం పంపిణీ

బంగారుపాళెం: మండలంలో శుక్రవారం 81 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందచేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో వంద శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తామన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

యాదమరి: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యులు కీనాటంపల్లె దళితవాడలో ర్యాలీ నిర్వహించారు. ఉదయం కీనాటంపల్లె ఆరోగ్య ఉపకేంద్రం నుంచి వైద్యులు, సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలని ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాత విధానం అమలు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : పాతపింఛన్ విధానం అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ కోరారు. ఆ సంఘ నాయకులు శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ విధానం అమలు చేస్తే లక్షలాది మంది ఉద్యోగులకు మేలు చేసినట్టవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్టీయూ నాయకులు దేవరాజులురెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



తవణంపల్లె: మండలంలోని అరగొండలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలలోని 36 మంది విద్యార్థులకు శుక్రవారం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు రాజేశ్వరమ్మ రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్ బాబునాయుడు

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబు నాయుడు అన్నారు. చిత్తూరు మండలం పచ్చన్నపల్లిలోని రైతులకు శుక్రవారం పీఎండీఎస్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఆయనతోపాటు రైతు సాధికార సంస్థ పీఆర్‌పీ పద్మావతి, సుబ్రమణ్యం మాట్లాడుతూ పీఎండీఎస్ కిట్ల ద్వారా అందించే నవధాన్యాలు బీడు భూముల్లో భూసారాన్ని పెంచేందుకు తోడ్పడుతాయని చెప్పారు. పంట ఎదుగుదలతో పాటు దిగుబడి స్థాయిని పెంచుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ హంస, నాయకులు వేలుస్వామి, సిబ్బంది కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

చిత్తూరు కార్పొరేషన్: దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా శనివారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డీసీసీబీ వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాళి అర్పించనున్నారు. అనంతరం గుడిపాల మండలం శ్రీరంగంపల్లె గ్రామంలో నూతన వైఎస్సార్ విగ్రహం ప్రారంభించనున్నారు. ఎంఎస్సార్ సర్కిల్ వద్ద మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పాతకోర్టు వద్ద అన్నదానం చేయనున్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి డీసీసీబీ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించనున్నారు. సంతపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు.

బంగారుపాళెం: మండలంలో శనివారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు.

తవణంపల్లె: వైఎస్సార్ వర్ధంతి నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ సి. హరిరెడ్డి తెలిపారు.

నేడు గుడిపాలలో

గుడిపాల: వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మండలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం పొన్నియమ్మ గుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం శుక్రవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో చైర్మన్‌గా ఎత్తిరాజులు, సభ్యులుగా అమరేంద్రబాబు, సుధాకర్‌రెడ్డి, సుజాత, భారతి, చిత్ర, నాగరాజు, సుధాకర్ గురుక్కల్ ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే, ఆయన సతీమణి సత్యవతిని ఘనంగా సన్మానించి స్వామి ప్రసాదాలు అందజేశారు.

దోమల వ్యాప్తితోనే రోగాలు



సత్యనారాయణపురంలో పర్యటిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: దోమల వ్యాప్తి వల్ల రోగాలు ముసురుకుంటున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీదేవి అన్నారు. నగరంలోని సత్యనారాయణపురంలో శుక్రవారం చేపట్టిన ఫ్రైడే డ్రైడేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణం పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వారం రోజులుగా చిత్తూరు పరిసర ప్రాంతాల్లో జోరు వాన కురుస్తోందన్నారు. ఈ వర్షానికి పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని చెప్పారు. దీని కారణంగా సాధారణ, విష జ్వరాలు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమలు వృద్ధి కాకుండా పరిసరాల శుభ్రత పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ శ్రీనివాసులు, నగర హెల్త్ ఆఫీసర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న సీఎం అయితేనే సంక్షేమ ఫలాలు



లబ్ధిదారుకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



మార్లబండ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని 12 కమ్మపల్లె పంచాయతీలో శుక్రవారం ఆయన జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్లబండ, పెడకంటి పల్లెలో ఎమ్మెల్యే పర్యటించారు. మార్లంబడ గ్రామస్తులు తిలకం దిద్ది స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమ ఫలాలను ఫలాలు వివరించారు. సమస్యలు తెలుసుకుని అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే జగనన్న ఉద్దేశమని చెప్పారు. ప్రజలతో మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు పాలించినప్పటికీ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన కుమారుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన ప్రజల గుండెల్లోనూ, చరిత్ర పుటల్లోనూ నిలిచిపోయిందని ప్రశంసించారు. ఎందుకంటే పార్టీలకతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరి ముంగిట్లోకే పథకాలు చేరుతున్నాయని వివరించారు. ఈ పథకాలు కొనసాగాలన్నా, ఎమ్మెల్యేలు గడప వద్దకు రావాలన్నా మళ్లీ జగనన్నకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. దీనిపై అక్కడున్న గ్రామస్తులందరూ జగనన్నకే మా ఓటు అని నినాదాలు చేసి చప్పట్లు కొట్టడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

భోజనం రుచిగా ఉంది

మార్లబండ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనం బాగుందా అని అడగగానే ''చాలా బాగుంది సార్... మా ఇళ్లలో కూడా పెట్టరు.''అని సమాధానం ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు అందించిన వైఎస్సార్ పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్ చేతులమీదుగా పంపిణీ చేశారు. 184 గొల్లపల్లె పంచాయతీ లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, ఎంపీటీసీ దుర్వాసులు, సర్పంచ్ కోటీశ్వరన్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, నాయకులు మనోహరన్, కార్తిక్ రెడ్డి, నాగరాజు తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.